సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 28 । మార్చి । 2024



రికార్డ్ బ్రేక్! 8లో
విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం ఈ ఏడాది ఇప్పటివరకు 2.9 మిలియన్ల ప్రయాణికుల రాకపోకలతో రికార్డు సొంతం చేసుకుంది.



ఓటుహక్కుపై అవగాహన
జిల్లాలో చింతపల్లి, చింతూరు, అడ్డతీగలలో ఓటు వినియోగంపై అధికారులు విస్తృతంగా ప్రచారం చేసి అవగాహన కల్పించారు. 9లో

రంజాన్ వేళలు

పాడేరు, అరకు

ఇఫ్తార్ (గురు)	సహర్ (శుక్ర)
6.13	4.39

రంపచోడవరం

ఇఫ్తార్ (గురు)	సహర్ (శుక్ర)
6.27	4.45

న్యూస్‌రీల్

జిప్‌లైన్ ఏర్పాటుపై విచారణ



బొర్రా వద్ద జిప్‌లైన్‌పై విచారణ చేస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ లీగల్ అడ్వయిజర్ త్రినాథరావు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహల వద్ద ఏర్పాటుచేసిన జిప్‌లైన్‌పై ట్రైబల్ వెల్ఫేర్ లీగల్ అడ్వైజర్ పి.త్రినాథరావుతో కూడిన అధికారుల బృందం బుధవారం విచారణ జరిపింది. నిబంధనలకు విరుద్ధంగా ఓ ప్రైవేటు వ్యక్తి జిప్‌లైన్ ఏర్పాటుచేశారంటూ, ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు దృష్టికి స్థానిక గిరిజనులు తీసుకువెళ్లారు. ఈ విషయాన్ని ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ఈనేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ట్రైబల్ వెల్ఫేర్ లీగల్ అడ్వైజర్ పి.త్రినాథరావు బొర్రాలో స్థానికులు, పంచాయతీ అధికారుల నుంచి వివరాలు సేకరించారు. 1/70 యాక్ట్‌కు వ్యతిరేకంగా జిప్‌లైన్ నిర్వహిస్తున్నారని, గిరిజన ప్రాంతంలోని స్థానికుల ద్వారా సొసైటీ ఏర్పాటుచేసి జిప్‌లైన్ నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జేసీఎస్ కన్వీనర్ నవీన్, తదితరులు ఆయనను కోరారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని లీగల్ అడ్వైజర్ పి.త్రినాథరావు తెలిపారు. థాయన వెంట తహసీల్దార్ నాగజ్యోతి, ఎంపీడీవో నగేష్, ఆర్ఐ శంకరరావు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్ష కేంద్రం తనిఖీ



శివలింగపురంలో టెన్త్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీడీ కొండలరావు

అనంతగిరి: మండలంలోని కొత్తవలస, బాలికల-1, శివలింగపురం, కేజీబీవీ ఈ నాలుగు పదో తరగతి పరీక్ష కేంద్రాలను డీడీ కొండలరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం పరీక్ష సెంటర్‌కు వెళ్లి, విద్యార్థులను పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా అన్ని పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టామని ఆయన తెలిపారు. మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి



రైతులకు టార్పాలిన్, అల్లం విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏఎస్పీ ప్రతాప్‌శివకిశోర్

చింతపల్లి రూరల్: గిరిజన రైతులు సాగులో మెలకువలు నేర్చుకుని అధిక దిగుబడులు సాధించాలని చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్ అన్నారు. స్థానిక పరిశోధన స్థానంలో బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు ఆర్గానిక్ సేంద్రియ విధానంలో సాగు చేయాలన్నారు. సాగులు, సిగినపల్లి, మాడేం గ్రామాలకు సంబంధించిన 10 మంది రైతులకు టార్పాలిన్లు 12 మందికి 200 కేజీల అల్లం విత్తనాలు, మామిడి పూత సంరక్షణకు ఐదు వేల కవర్లను పంపిణీ చేశారు. సీఐ రమేష్, గూడెం కొత్తవీధి ఎస్ఐ అప్పలసూరి, కేవీకే శాస్త్రవేత్త శైలజ, అగ్రికల్చర్ ఇంజనీర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం



గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు

దేవిపట్నం: మండలంలోని పోతవరం నుంచి దండంగి వెళ్లే మార్గంలో బుధవారం వాహన తనిఖీల్లో 500 గ్రాముల గంజాయి పట్టుకున్నట్లు ఎస్సై నాగార్జున తెలిపారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన రాజేష్ కుమార్ సింగ్‌ను పట్టుకుని, ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించామన్నారు.

● అరకు టీడీపీ గొంతులో 'కాషాయం'

దొన్నుదొరకు ఝలక్

- అరకు అసెంబ్లీ అభ్యర్థిగా పాంగి రాజారావు పేరు బీజేపీ ప్రకటన
- చంద్రబాబు క్షుద్ర రాజకీయాలకు మరోనేత బలి
- ఆ పార్టీ శ్రేణుల్లో గందరగోళం



వెన్నుపోటు రాజకీయాలకు బ్రాండ్ అంబాసిడర్ అయిన చంద్రబాబు తన క్షుద్ర రాజకీయాలకు సొంత పార్టీ నేతలను కూడా వదలడం లేదు. అరకు అసెంబ్లీ అభ్యర్థి సియారి దొన్నుదొర విషయంలో ఇదే జరిగింది. ముమ్మరంగా ప్రచారం చేసుకుంటున్న తరుణంలో అతన్ని కాదని కూటమి తరఫున బీజేపీ అభ్యర్థిగా పాంగి రాజారావు పేరు ప్రకటించడం టీడీపీ శ్రేణుల్లో నైరాశ్యం నింపింది. పొత్తు ఎత్తుగడలకు సివేరి అబ్రహంతోపాటు దొన్నుదొర బలయ్యారు.

సాక్షి,పాడేరు: బీజేపీకి తలొగ్గిన చంద్రబాబు అరకులోయ టీడీపీకి ఝలక్ ఇచ్చారు. అరకులోయ అసెంబ్లీ అభ్యర్థిగా పాంగి రాజారావును బీజేపీ అధిష్ఠానం బుధవారం ప్రకటించడం వెనుక ఆయన చేతకానితనం మరోసారి వెల్లడైంది. ఈ పరిణామంతో అరకులోయ టీడీపీ అభ్యర్థి సియారి దొన్నుదొరతో పాటు పార్టీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది. రెండు నెలల క్రితమే అరకు సభలో అరకులోయ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా సియారి దొన్నుదొరను చంద్రబాబు ప్రకటించడం తెలిసిందే. దీన్ని దివంగత మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ కుమారుడు సివేరి అబ్రహం తీవ్రంగా వ్యతిరేకించారు. రెబల్ అభ్యర్థిగా పోటీచేస్తానని ప్రకటించారు. అనుచరులతో ముమ్మరంగా ప్రచారం చేసుకుంటున్నారు. దీంతో టీడీపీ శ్రేణులు వర్గాలుగా విడిపోయారు.

ఎటూతేల్చని పాడేరు సీటు

చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అరకు పార్లమెంట్, పాడేరు అసెంబ్లీ స్థానాలను బీజేపీకి ఇచ్చేందుకు అంగీకరించారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు అరకులోయ టీడీపీ అభ్యర్థిగా సియారి దొన్నుదొర పేరును ప్రకటించడంతో ఆయన అప్పటినుంచి ప్రచారం చేసుకుంటున్నారు. ఈ తరుణంలో అరకు పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా కొత్తపల్లి గీతను ప్రకటించిన ఆ పార్టీ అధిష్టానం తాజాగా అరకులోయ అసెంబ్లీ బీజేపీ అభ్యర్థిగా పాంగి రాజారావును ప్రకటించడం చర్చనీయాంశమైంది. పాడేరు అసెంబ్లీ స్థానంలో బీజేపీ అభ్యర్థిని ప్రకటిస్తారని టీడీపీ, బీజేపీ నేతలు భావిస్తున్న తరుణంలో పాడేరు సీటు పెండింగ్‌లో పెట్టి టీడీపీ అభ్యర్థి బరిలో ఉన్న అరకు స్థానంలో బీజేపీ ఏకంగా తమ అభ్యర్థిని ప్రకటించడం వెనుక చంద్రబాబు కుటిల రాజకీయం ఉందన్న విమర్శలు వినవస్తున్నాయి.

పాడేరులో పోటీకి బీజేపీ అయిష్టం

బీజేపీతో చెలిమి కోసం ఆ పార్టీ పెద్దల కాళ్లు కూడా పట్టుకునేలా వ్యవహరించిన టీడీపీ నేత చంద్రబాబు చివరకు అరకు అసెంబ్లీ సీటును కూడా బీజేపీకి కట్టబెట్టారన్న ప్రచారం జరుగుతోంది. కొన్ని రోజుల క్రితం వేలాది మంది గిరిజనుల సమక్షంలో అరకు అసెంబ్లీ అభ్యర్థిగా సియారి దొన్నుదొరను ప్రకటించిన చంద్రబాబు పాడేరు సీటును బీజేపీకి వదిలిపెట్టారు. అయితే తమకు ప్రాధాన్యం లేని పాడేరులో బీజేపీ పోటీ చేసేందుకు సుముఖత వ్యక్తం చేయలేదు. దీంతో అరకు స్థానాన్ని తీసుకొని పాంగి రాజారావుకు సీటు కేటాయించినట్టు తెలిసింది.

మండిపడుతున్న టీడీపీ శ్రేణులు

బీజేపీ నేతలు మంగళవారం నిర్వహించిన సమావేశంలో అరకు బీజేపీ టికెట్ పాంగి రాజారావుకు కేటాయించాలని నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. అరకు పార్లమెంట్‌తో పాటు అరకు అసెంబ్లీకి బీజేపీ అభ్యర్థులను ప్రకటించడంతో టీడీపీ శేణులు అంతా చంద్రబాబు తీరుపై మండిపడుతున్నాయి. చంద్రబాబు బీజేపీతో పొత్తుకోసం పార్టీని బలిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. మొదట బీజేపీకి పాడేరు సీటు కేటాయించడంతో స్థానిక టీడీపీ నేతల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. ఇప్పుడు బీజేపీ అరకు సీటు కోరేసరికి కేటాయించిన చంద్రబాబు ఆ పార్టీ చేతిలో కీలుబొమ్మగా మారారని ఆ పార్టీ శ్రేణులు మండిపడుతున్నాయి. దీనివల్ల పార్టీ భవిష్యత్తును బలిచేస్తున్నారని వారు బహిరంగంగా విమర్శిస్తున్నారు. క్షుద్ర రాజకీయాలకు సివేరి అబ్రహం మాదిరిగానే అరకు టీడీపీ అభ్యర్థి సియారి దొన్నుదొర బలయ్యారు. ఆయన భవిష్యత్తు కార్యాచరణకు తన అనుచరులతో సిద్ధమవుతున్నట్టు సమాచారం.

ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు



పాడేరు డిగ్రీ కళాశాలలో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ విజయసునీత



రాష్ట్ర ఎన్నికల అధికారి వీడియో సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ విజయ సునీత, ఆర్వోలు

- జిల్లా ఎన్నికల అధికారి విజయ సునీత
- ఎన్నికల అధికారులకు సూచన

సాక్షి,పాడేరు: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంసంబంధించి ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్,కౌంటింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.విజయసునీత ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని పాడేరు, అరకులోయ నియోజకవర్గాలకు సంబంధించి ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్,కౌంటింగ్ కేంద్రాలను బుధవారం ఆమె పరిశీలించారు. పాడేరు,అరకులోయ అసెంబ్లీ ఆర్వోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించే లక్ష్యంతో ఉన్నామని, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లతో పాటు స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల్లో ఎలాంటి అపోహలకు తావులేకుండా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని సూచించారు. భద్రత పరమైన చర్యలను పటిష్టంగా నిర్వహించాలన్నారు. పోలింగ్‌కు ముందురోజే ఎన్నికల సామగ్రి పంపిణీ విధానం, కౌంటింగ్‌పై అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అరకులోయ, పాడేరు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు వి.అభిషేక్, భావన, ఎస్‌డీసీ అంబేద్కర్, గిరిజన సంక్షేమశాఖ పాడేరు ఈఈ డీవీఆర్ఎం రాజు పాల్గొన్నారు.

సాక్షి,పాడేరు: సార్వత్రిక ఎన్నికలకు సంభందించి బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్‌మీనా వీడియో సమావేశం నిర్వహించారు. పాడేరులోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ విజయసునీత, పాడేరు, అరకులోయ ఆర్వోలు భావన, వి.అభిషేక్, డీఆర్వో పద్మావతి, ఎస్‌డీసీ అంబేద్కర్ పాల్గొన్నారు.

నాటు తుపాకుల అప్పగింత

దేవీపట్నం: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాటు తుపాకులు స్వచ్ఛందంగా అప్పగించాలని ఎస్ఐ నాగార్జున తెలిపారు. మండలంలో దేవారం, పోతవరం గ్రామాలకు చెందిన వ్యక్తులు స్వచ్ఛందంగా ఐదు నాటు తుపాకులు అప్పగించారన్నారు. మిగిలిన వారు కలిగి ఉంటే అప్పగించాలన్నారు. వీరి వివరాలు గోప్యంగా ఉంచుతామని, ఎటువంటి క్రిమినల్ కేసులు నమోదు చేయబోమని ఆయన హామీ ఇచ్చారు.



తుపాకులు చూపిస్తున్న ఎస్ఐ నాగార్జున

మలేరియా ప్రబలకుండా ముందస్తు చర్యలు

- జోనల్ మలేరియా అధికారి శాంతిప్రభ
- వంట్లమామిడి వెల్‌నెస్ సెంటర్, గ్రామ సచివాలయ సిబ్బంది పనితీరుపై అసంతృప్తి
- చర్యలకు ఆదేశం



డీఎంహెచ్‌వోకు సూచనలిస్తున్న మలేరియా జోనల్ అధికారి డాక్టర్ శాంతిప్రభ



మలేరియా కేసుల వివరాలను తెలుసుకుంటున్న డిప్యూటీ డైరెక్టర్ రామ్‌నాథరావు

పాడేరు : ఏజెన్సీలో మలేరియా ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ శాంతిప్రభ తెలిపారు. బుధవారం ఆమె పాడేరు మండలంలో పర్యటించారు. ఈదులపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ల్యాబ్‌తో పాటు రికార్డులను పరిశీలించారు. మలేరియా కేసులు నమోదైన కందులపాలెం, చింతాడ, వంట్లమామిడి గ్రామాలను సందర్శించారు. వంట్లమామిడి వెల్‌నెస్ సెంటర్, గ్రామ సచివాలయ సిబ్బంది పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో జమాల్‌బాషాకు సూచించారు. జిల్లాలో మలేరియా ప్రబలకుండా ఉండేందుకు ల్యాబ్ టెక్నీషియన్లు, హెల్త్ అసిస్టెంట్లకు ప్రత్యేక శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని డీఎంహెచ్‌వో ఆమెకు వివరించారు. ఆమె వెంట ఈదులపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి నర్సింగరావు, ఎంపీహెచ్‌ఈవో తిరుపతిరావు, సిబ్బంది బి.తిరుపతిరావు, ధనుంజయరావు, శేషాద్రి ఉన్నారు.

కేసులపై ఆరా

అనంతగిరి: మలేరియా కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మలేరియా డిప్యూటీ డైరెక్టర్ టి.రామ్‌నాథరావు ఆదేశించారు. మండలంలోని భీమవారం పీహెచ్‌సీని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ముందుగా మలేరియా కేసులకు సంబంధించిన వివరాలను సిబ్బంది నుంచి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మలేరియా కేసులు అధికంగా నమోదవుతున్న చిలకలగెడ్డ, బూడి, తరమనవలస, చీమిడివలస గ్రామాలపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ మలేరియా బారిన పడిన వారికి వెంటనే వైద్యం అందించాలని సూచించారు. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం భీమవారం పీహెచ్‌సీ పరిధిలోని మలేరియా కేసులు తగ్గుముఖం పట్టాయని ఆయన తెలిపారు. మలేరియా కన్సల్‌టెంట్ శ్రీనివాసరావు, వైద్యాధికారి అనూప్, అప్పలనాయుడు, ఎంపీహెచ్‌ఈవో నందయ్య, సబ్ యూనిట్ అధికారి బాబూరావు పాల్గొన్నారు.

కలసికట్టుగా పనిచేసి విజయం సాధిద్దాం

వైఎస్సార్‌సీపీ అరకు ఎంపీ అభ్యర్థి తనూజరాణి





మాట్లాడుతున్న అరకు ఎంపీ అభ్యర్థి, పాడేరు అసెంబ్లీ అభ్యర్థి గుమ్మా తనూజరాణి, విశ్వేశ్వరరాజు

చింతపల్లి రూరల్: అందరం కలంకట్టుగా పనిచేసి విజయం సాధిద్దామని అరకు ఎంపీ అభ్యర్థి గుమ్మా తనూజరాణి అన్నారు. మండలంలో అంతర్లలో బుధవారం పార్టీ పరిశీలకులు శ్రీకాంత్ రాజు,పీలా వెంకటలక్ష్మి అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతం తమ పార్టీకి కంచుకోట అన్నారు. ఈ సారి కూడా విజయం తమదేనన్నారు. ప్రభుత్వం అందించిన సంక్షేమం, చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం పార్టీ శ్రేణులపై ఉందన్నారు. వైద్యురాలిగా పనిచేస్తున్న తనకు ప్రత్యేక స్థానం కల్పించి ప్రజలకు సేవ చేసే అదృష్టాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారన్నారు. పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ గిరిజనులకు సేవ చేసేందుకు అవకాశం కల్పించిన జగనన్నకు రుణపడి ఉంటానన్నారు. ఎన్నికలు వేళ కూటమి పార్టీలు అమలుకాని హామీలతో ముందుకు వస్తున్నాయని, వారిని ఏఒక్కరు నమ్మకుండా ఉండేలా ప్రజలను చైతన్యవంతులను చేయాలని సూచించారు. ఐదేళ్ల పాలనలో రాజకీయాలు, కులమతాలను పక్కన బెట్టి ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలు అందించారన్నారు. రైతులు, బలహీన వర్గాలకు ముఖ్యమంత్రి ప్రత్యేక స్థానం కల్పించారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ భారీ మెజారిటీతో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు కొరాబు అనూషదేవి, బోయిన కుమారి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జి.మాడుగుల జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత, జిల్లా వ్యవసాయ సలహాసంఘ చైర్మన్ సరస్వతి, పార్టీ మండల అధ్యక్షులు మోరి రవి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, వైస్ ఎంపీపీలు సాగిన వెంగళరావు, శారద, జేసీఎస్ కన్వీనర్ గణబాబు, ట్రైకార్ డైరెక్టర్ లోవరాజు, కోఆప్షన్ సభ్యులు నాజర్ వలీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నను సీఎం చేయాలి

గూడెంకొత్తవీధి: వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకువచ్చి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసేందుకు అందరూ కృషి చేయాలని అరకు ఎంపీ అభ్యర్థి గుమ్మా తనూజరాణి, పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. మండలంలోని శంకాడలో బుధవారం పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. తమ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించాలని వారు కోరారు. ఎన్నికల పరిశీలకులు శ్రీకాంత్‌రాజు, పీలా వెంకటలక్ష్మి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ నిలిపిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గిరిజన ప్రాంతానికి ప్రభుత్వం ఎంతో చేసిందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అన్ని గ్రామాల్లో పర్యటించామన్నారు. గిరిజనులకు తమ ప్రభుత్వం ఎంతో చేసిందన్నారు. యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, ఎంపీపీ బోయిన కుమారి, పార్టీ మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, వైస్ ఎంపీపీలు లోతా దేముడు, సప్పగెడ్డ ఆనంద్, ఎంపీటీసీలు,సర్పంచ్‌లు పాల్గొన్నారు.



శంకాడలో పర్యటిస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు

సింహగిరిపై ఆధ్యాత్మిక కాంతులు

- వైభవంగా సుదర్శన నారసింహా మహాయజ్ఞం ప్రారంభం
- పూర్ణాహుతిలో పాల్గొన్న శారదాపీఠాధిపతులు
- తొలిరోజు పాల్గొన్న వంద మంది ఉభయదాతలు



యజ్ఞశాలలో సుదర్శన నారసింహ మహా యజ్ఞాన్ని నిర్వహిస్తున్న రుత్వికులు



స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతిలను సత్కరిస్తున్న దేవస్థానం ఈవో


సింహాచలం: సింహగిరి బుధవారం సుదర్శన నారసింహ మహాయజ్ఞం శోభను సంతరించుకుంది. ఎటు చూసినా యజ్ఞకాంతులతో ప్రజ్వరిల్లింది. లోకకల్యాణార్థం ఏప్రిల్ 1వ తేదీ వరకు జరగనున్న సుదర్శన నారసింహ మహాయజ్ఞంను పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి దేవస్థానం అర్చకులు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఉదయం 6 గంటల నుంచి యజ్ఞఘట్టాలను నిర్వహించారు. స్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఓ పల్లకీలో, చక్రపెరుమాళ్‌ను ఓ పల్లకీలో అధిష్ఠింపజేసి ఆలయ ఉత్తర రాజగోపురం ఎదురుగా ఏర్పాటు చేసిన యాగశాలలోకి తిరువీధిగా తీసుకొచ్చారు. యజ్ఞశాలలో చక్రపెరుమాళ్‌ను, మరొక వేదికపై స్వామి ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేశారు. యాగశాల మూర్తి ఆరాధన, శాంతిపాఠం, గోపూజ నిర్వహించారు. ప్రకృతి సిద్ధంగా అగ్ని మథనం చేశారు. అనంతరం అగ్నిప్రతిష్టాపనం, కుంభావాహనం, మండలావాహనం, ధ్వజావరోహణం చేపట్టారు. తదుపరి యజ్ఞశాలలో ఏర్పాటు చేసిన ఐదు హోమ గుండాల వద్ద రుత్వికులు యజ్ఞాన్ని ప్రారంభించారు. మధ్యాహ్నం 12గంటల సమయంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పూర్ణాహుతి ప్రసాదాన్ని యజ్ఞంలో పాల్గొన్న ఉభయదాతలు, భక్తులకు అందజేశారు. అనంతరం ఉత్సవమూర్తుల చెంతన రామాయణం, భాగవతం, విష్ణుపురాణం, నృసింహ సహస్రనామం, దివ్యప్రభంద పారాయణం, క్షేత్ర మహత్యం, సుదర్శన శతకం పారాయణాలను వైదికులు పఠించారు. విశేషంగా హారతులు అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా, తమిళనాడు నుంచి వచ్చిన సుమారు 60 మంది రుత్వికులు యజ్ఞం నిర్వహించారు. విశాఖ శ్రీ శారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. యజ్ఞంలో పాల్గొన్న ఉభయదాతలకు దేవస్థానం తరఫున శాలువ, రవిక, కల్యాణం లడ్డూ, అర కిలో పులిహోర ప్రసాదం, అప్పన్న స్వామి రాగి ప్రతిమ అందజేశారు. పిలిగ్రిమ్స్ సెంటర్‌లో ప్రత్యేకంగా భోజన సదుపాయం అందజేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. దేవస్థానం వంశపార ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతి రాజు, ట్రస్ట్ బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అప్పన్నకు శారదాపీఠాధిపతులు పూజలు

సుదర్శన నారసింహ మహా యజ్ఞంలో పాల్గొనేందుకు వచ్చిన శారదాపీఠాధితులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి మూలవిరాట్‌ను దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద వారికి దేవస్థానం అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామీజీల పేరిట అంతరాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో కుంకుమార్చన చేసి, వేద ఆశీర్వచనం అందజేశారు. దేవస్థానం తరఫున ఈవో శ్రీనివాసమూర్తి స్వామీజీలకు శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందించారు.

కమనీయం ఆది దంపతుల కల్యాణం

పీఎం పాలెం : కారుషెడ్ కూడలిలోని శ్రీ కాశీ ఉమా మహేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం కన్నులపండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణం తిలకించారు. అంతకుముందు ఆది దంపతుల ఉత్సవ మూర్తులను పల్లకీలో ఊరేగించారు. అనంతరం వేలాది మందికి భారీ అన్నసమారాధన చేశారు. రాష్ట్ర నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, పోతిన సూర్యారావు, నాయుడుబాబు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామివారు



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

దోమల నివారణకు పూర్తిస్థాయిలో స్ప్రేయింగ్

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: మలేరియా పూర్తిస్థాయిలో నిర్మూలనకు గ్రామాల్లో ప్రతీ ఇంటికి నివారణ మందు పిచికారీ చేయిస్తామని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన ఏడీఎంహెచ్‌వో, మలేరియా అధికారులతో నిరర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుంచి పిచికారీ ప్రారంభమైందన్నారు. మలేరియా లక్షణాలు ఉంటే వారికి రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్యం అందించాలని సూచించారు. మలేరియాకు సంబంధించిన మందులు, ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జనవరి నుంచి ఇప్పటివరకు నమోదైన కేసుల వివరాలను వైద్యాధికారులు, సబ్ యూనిట్ అధికారుల నుంచి ఆయన తెలుసుకున్నారు. మలేరియా నిర్మూలనకు అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దోమల నివారణ మందు పిచికారీపై ఎప్పటికప్పుడు నివేదిక అందజేయాలని ఆయన కోరారు. ఏడీఎంహెచ్‌వో జి.ప్రకాశం, మలేరియా ఏఎంవో నక్క వెంకటేశ్వరరావు, రామకృష్ణ, ఎస్‌వో టి.మార్తమ్మ, సబ్ యూనిట్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

20 లీటర్ల సారాతో ఒకరి అరెస్టు



పట్టుబడ్డ సారాతో నిందితుడు, రావికమతం ఎస్‌ఐ ధనంజయ్

రావికమతం : గడబపాలెం గ్రామంలో పెద్ద ఎత్తున సారా తయారు చేస్తున్నట్టు అందిన సమాచారంతో సిబ్బందితో దాడి జరిపి ఒకరిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్‌ఐ ధనంజయ్ బుధవారం తెలిపారు. గ్రామం శివారున పొలాల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల పులుపును, తయారీ పరికరాలను గుర్తించి ధ్వంసం చేశామన్నారు. ఆ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి 20 లీటర్ల సారాతో పారిపోతుండగా పట్టుకుని అరెస్ట్ చేశామని ఎస్‌ఐ తెలిపారు.

టిఫిన్ షాపులో అక్రమంగా మద్యం బాటిళ్లు

- ఒకరి అరెస్టు



పట్టుబడిన అక్రమ మద్యం సీసాలు

చోడవరం రూరల్ : అక్రమంగా మద్యం నిల్వ చేసిన టిఫిన్ షాపు యజమాని నుంచి చోడవరం పోలీసులు 30 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అతడిని అరెస్టు చేశారు. చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు అందించిన వివరాలివి. చోడవరం పట్టణ శివారు బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన బొంతు శ్రీను (46) తన టిఫిన్ షాపులో అక్రమంగా మద్యం నిల్వ చేసినట్టు సమాచారం అందడంతో ఎస్‌ఐ ఎ.సూర్యనారాయణ సిబ్బందితో కలసి బుధవారం ఉదయం దాడి చేయగా టిఫిన్ షాపులో దాచిన 30 మద్యం సీసాలు పట్టుబడ్డాయని, దీంతో అతడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని సీఐ తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో సారా పులుపు ధ్వంసం



సారా పులుపు ధ్వంసం చేస్తున్న పోలీసులు



గంటికొర్లాంలో పులుపు ధ్వంసం చేస్తున్న ఎస్‌ఐ ఈశ్వరరావు

గొలుగొండ: కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మారుమూల ప్రాంతాల్లో నాటు సారా తయారికి ఉపయోగించే సారా పులుపును ఎస్‌ఐ ఉపేంద్ర ఆధ్వర్యంలో బుధవారం ధ్వంసం చేశారు. కొంకసింగి, నాగాపురం, అల్లూరి జిల్లా సరిహద్దులో సారా తయారీకి ఉపయోగపడే 1300 లీటర్ల సారా పులుపును ధ్వంసం చేశామని ఎస్‌ఐ ఉపేంద్ర తెలిపారు. సారా తయారి, అమ్మకాలు, బెల్టు షాపుల్లో మద్యం అమ్మకాలు చేయరాదని హెచ్చరించారు.

బుచ్చెయ్యపేట : మండలంలో గల శివారు పంచాయతీ గంటికొర్లాం కొండలవద్ద గుట్టుగా సారా తయారీ చేస్తున్న సారా బట్టీలపై బుచ్చెయ్యపేట పోలీసులు దాడులు చేశారు. స్థానికుల సమాచారం మేరకు బుధవారం ఎస్‌ఐ డి.ఈశ్వరరావు తమ సిబ్బందితో గంటికొర్లాం కుప్పకొండ ప్రాంతాల్లో నాలుగు కిలోమీటర్ల పైన కాలినడకన వెళ్లి సారా బట్టీల కోసం గాలింపు చేపట్టారు. కొండ వద్ద సారా తయారీకి సిద్ధం చేసిన 1,500 లీటర్ల బెల్లం పులుపును, సారా తయారీకి ఉపయోగించే పరికరాలను గుర్తించి వాటిని అక్కడే దహనం చేశారు. నిర్వాహకుడి గురించి ఆరా తీశారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్థిక భారం తప్పింది



నాపేరు రేవు గణేష్. గత 15 ఏళ్లుగా చింతూరులో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాను. గత ప్రభుత్వాల హయాంలో ఆర్థికంగా నాకు ఎలాంటి సాయం అందలేదు. చిన్నపాటి పెట్టుబడులకు ఎంతో ఇబ్బందులు పడేవాడిని. వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక వైఎస్సార్ వాహనమిత్ర పథకం కింద ఏడాదికి రూ 10 వేలు క్రమం తప్పకుండా ఇస్తున్నారు. ఈ సొమ్ములు నాకు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయి. నా ఆటోకు ఇన్సూరెన్సు, బ్రేకు, పొల్యూషన్, పర్మిట్ వంటి ఆర్టీవో కార్యాలయ పనులతో పాటు మైనర్ రిపేర్లు చేసుకునేందుకు దోహద పడుతున్నాయి. గతంలో అప్పుచేసి మరీ వీటికి సొమ్ములు వెచ్చించాల్సి వచ్చేది. ప్రతి ఏడాది ఆర్థికసాయం అందిస్తూ ఆదుకుంటున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటా.

బతుకు బండికి భరోసా ఇచ్చారు



నా పేరు కోడి నాగరాజు. మాది మాకవరపాలెం మండలం తూటిపాల. నేను 20 సంవత్సరాల నుంచి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాను. నాకు ముగ్గురు పిల్లలు. ఐదేళ్ల కిందటి వరకూ కుటుంబ పోషణ చాలా కష్టంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఆటో కార్మికులకు జగనన్న అండగా నిలిచారు. వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా వరుసగా ఐదు సంవత్సరాలు ఏడాదికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.50 వేలు నా ఖాతాలో జమ చేశారు. కరోనా కష్ట కాలంలో కూడా వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా రూ.10 వేల సాయం నా ఖాతాలో వేశారు. వాహనమిత్ర డబ్బుతో ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకుని ధైర్యంగా ఆటో తిప్పుతున్నాను. నా పెద్ద కుమార్తెకు విద్యా దీవెన పథకం కింద రూ.56,538, చిన్న కుమార్తెకు అమ్మఒడి పథకంలో రూ.43,000, నా కుమారుడికి వసతి దీవెనలో రూ.52,825 అందడంతో వారి చదువులకు ఇబ్బంది లేకుండా పోయింది. నా భార్యకు వైఎస్సార్ ఆసరాలో రూ.61,521, సున్నా వడ్డీ రూ. 2,666 అందాయి. కోవిడ్ సాయంగా రూ.10 వేలు అందించారు. ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న మాకు సంక్షేమ పథకాలతో ఈ ప్రభుత్వం ఒక అండగా నిలిచింది.

వాహన మిత్రోత్సాహం!

- ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు ఏటా రూ.10 వేలు
- ఉమ్మడి విశాఖలో ఏడాదికి 36,375 మందికి మేలు
- ఐదేళ్లలో రూ.182.96 కోట్లకు పైగా సాయం
- తమ కోసం ఆలోచించిన ఏకైక సీఎం జగనే అంటున్న డ్రైవర్లు



వాహనమిత్ర లబ్ధిదారులతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

నవశకం సంక్షేమ సంతకం

సాక్షి, విశాఖపట్నం/చింతూరు: ఆటోలు, ట్యాక్సీలు నడుపుకుంటూ స్వయం ఉపాధి పొందుతున్న వారి సంక్షేమానికి ప్రభుత్వం అమలుచేసిన వైఎస్సార్ వాహన మిత్ర పథకం ఎంతగానో ఉపయోగపడింది. ఇన్సూరెన్స్, రిపేర్లు, సర్వీసింగ్ వంటి ఖర్చుల నుంచి కాస్త ఉపశమనం ఇచ్చేలా ఏటా రూ.10 వేలు చొప్పున ఐదేళ్ల సాయం అందించింది. ఆటోలు, ట్యాక్సీలు, క్యాబ్ డ్రైవర్లు ఏ రోజుకారోజు వచ్చే ఆదాయంతో కుటుంబాలను పోషించుకుంటారు. వీరి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం కావడంతో బీమా సొమ్ము చెల్లించలేక పోతున్నారు. తమ వాహనాలకు మరమ్మతులు చేయాలన్నా అప్పులు చేయాల్సి వస్తోంది. వాటిని తీర్చడానికి మరింత అప్పుల పాలవుతున్నారు. అరకొర రాబడితో జీవనం సాగించే వీరి కుటుంబాలకు చేయూత నివ్వాలని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. ఏలూరులోని ప్రజా సంకల్ప పాదయాత్రలో ఉండగా 2018 మే 14న తాను అధికారంలోకి వచ్చాక ఆర్థిక సాయం అందిస్తానని ప్రకటించారు. ఆ ప్రకారమే అధికారంలోకి వచ్చాక 2019 అక్టోబర్ 14న వైఎస్సార్ వాహన మిత్ర పథకానికి ఏలూరులోనే శ్రీకారం చుట్టారు. ఈ పథకం కింద ఏటా ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు ఏటా రూ.10 వేల చొప్పున ఇస్తున్నారు.

ఈ సొమ్ముతో వారు వాహనాల ఫిట్‌నెస్, మరమ్మతులు, బీమా తదితర అవసరాలు తీర్చుకుంటారన్న సంకల్పంతో క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారు. ఈ సొమ్మును వారి బ్యాంకు ఖాతాల్లోనే నేరుగా జమ చేస్తున్నారు. దీంతో గడచిన ఐదేళ్లుగా వీరు ఎంతో సంతోషంగా ఉన్నారు. గతంలో తమ కోసం ఇంతలా ఆలోచించిన ముఖ్యమంత్రులు లేరని ఈ వాహన మిత్రులు పేర్కొంటున్నారు. అందుకే తమకు ఆర్థికంగా దన్నుగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌కు ఎప్పుడూ రుణపడి ఉంటామని, అండగా నిలుస్తామని చెబుతున్నారు.

ఐదేళ్లలో ఎంత సాయమంటే..?

ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు 36 వేల మందికి వాహనమిత్రులు పథకం కింద ఆదుకున్నారు. వీరికి ఈ ఐదేళ్లలో రూ.182.96 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించారు. 2019 నుంచి 2022 వరకు ఉమ్మడి జిల్లాల పునర్విభజన జరిగాక విశాఖపట్నం జిల్లాలో రూ.41.84 కోట్లు, అనకాపల్లి జిల్లాలో రూ.25.84 కోట్లు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో రూ.6.70 కోట్లను వాహన మిత్ర పథకం కింద అందజేశారు. రంపచోడవరం నియోజవర్గంలో వాహనమిత్ర ద్వారా 975 మందికి రూ. 3కోట్ల 75 లక్షల మేర లబ్ధి చేకూరింది.

అర్హులందరికీ సాయం



ప్రజా సంకల్పయాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆటోడ్రైవర్లకు ఆర్థిక భరోసా కల్పించి గొప్ప మనసు చాటుకున్నారు. వాహనమిత్ర పథకంతో అందిన సొమ్ముతో ఆటో మరమ్మతులు చేసుకోవడం, బీమా కోసంవినియోగించుకున్నా.. అర్హులందరికీ సాయమందించారు. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

–బి.కోటేశ్వరరావు, వెంకటాపురం

గౌరవంగా జీవిస్తున్నాం



దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో వాహనమిత్ర పథకాన్ని అమలు చేస్తున్నారు. ఏటా రూ.10 వేల సాయాన్ని అర్హులైన ప్రతీ ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్‌లు అందుకున్నారు. ఈ మొత్తం ఎంతో ఉపయోగపడుతోంది. గతంలో సకాలంలో బీమా కట్టలేక ఇబ్బందులు పడేవాళ్లం. రోడ్డుపై పోలీసులు కనిపిస్తే భయపడేవాళ్లం. వాహన మిత్ర పథకం వల్ల అన్ని రికార్డులు ఉన్నాయి. ఎంతో గౌరవంగా గర్వంగా బతుకుతున్నాం.

– పిట్ట అశోక్ కుమార్, పద్మనాభనగర్

రికార్డ్ బ్రేక్!

- 2.9 మిలియన్లను అధిగమించిన ప్రయాణికులు
- విశాఖ ఎయిర్‌పోర్టు చరిత్రలో ఇదే అత్యధికం
- మూడు మిలియన్ల దిశగా అడుగులు



ఎయిర్‌పోర్టు

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రయాణికుల తాకిడిలో సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ ఎయిర్‌పోర్టు ఏర్పాటయ్యాక అత్యధిక మంది ప్రయాణికుల రాకపోకలను ఇప్పుడు నమోదు చేసింది. ఈ ఏడాది ఇప్పటివరకు 2.9 మిలియన్లు (29 లక్షల మంది) ప్రయాణికులు రాకపోకలతో ఈ రికార్డును సొంతం చేసుకుంది. ఇప్పటివరకు 2018లో 28.54 లక్షల మంది ప్రయాణించడమే అత్యధికం. కానీ ఇప్పుడు ఆ సంఖ్యను అధిగమించి 29 లక్షలకు చేరుకోవడం విశేషం! కోవిడ్-19 తర్వాత ఇతర ఎయిర్‌పోర్టుల మాదిరిగానే విశాఖ విమానాశ్రయానికి కూడా ప్రయాణికుల తాకిడి గణనీయంగా తగ్గింది. కోవిడ్ ప్రభావంతో 2020–21లో 11.14 లక్షల మంది మాత్రమే ఈ ఎయిర్‌పోర్టు ద్వారా ప్రయాణించారు. ఆ తర్వాత ఏడాది స్వల్పంగా పెరిగినా 16.31 లక్షలకు మించలేదు. అనంతరం ఏటికేడాది విమాన ప్రయాణికుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఇలా 2022–23లో 25 లక్షలకు, ఈ ఏడాది 29 లక్షలకు ఎగబాకింది. రానున్న ఏళ్లలో అది మూడు మిలియన్ల (30 లక్షల)కు చేరుకుంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ ఎయిర్‌పోర్టు సామర్థ్యాన్ని 3.6 మిలియన్లకు విస్తరించారు. అందుకనుగుణంగా ఎన్నో సదుపాయాలను కల్పించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన సౌకర్యాలను సమకూర్చారు. కొద్దిరోజుల క్రితమే ఎగ్జిక్యూటివ్ లాంజ్‌ను ప్రారంభించారు. చెక్ ఇన్ కౌంటర్లను 20–30కి పెంచారు. అరైవల్, డిపాచర్ టెర్మినల్ వద్ద మనీ ఎక్స్ఛేంజి కౌంటర్లు, తనిఖీల వేగవంతానికి ఇప్పుడున్న నాలుగు ఎక్స్‌రే స్కానింగ్ మిషన్లకు అదనంగా మరో రెండింటిని ఏర్పాటు చేశారు. డిజీ యాత్ర యాప్‌ను కూడా అందుబాటులోకి తెస్తున్నారు. ఇన్‌లైన్ బ్యాగేజీ వ్యవస్థను రెండు నెలల్లో సిద్ధం చేస్తున్నామని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్.రాజారెడ్డి 'సాక్షి'కి చెప్పారు. విమానాశ్రయం ప్రయాణికుల రద్దీ 2.9 మిలియన్లను అధిగమించడం సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. మున్ముందు 3 లక్షల మిలియన్ల మైలురాయికి చేరుకుంటుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

పెరుగుతున్న విమాన సర్వీసులు..

మరోవైపు ఈ ఎయిర్‌పోర్టుకు విమాన సర్వీసులు కూడా పెరుగుతున్నాయి. ప్రస్తుతం సింగపూర్‌కు అంతర్జాతీయ విమాన సర్వీసు నడుస్తోంది. త్వరలో కౌలాలంపూర్, బ్యాంకాక్‌లకు కూడా కొత్త సర్వీసులు ప్రారంభమవుతున్నాయి. ఇవి కాకుండా హైదరాబాద్, ఢిల్లీలకు కూడా రెండు దేశీయ సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి.

పదేళ్లలో విమాన ప్రయాణికుల సంఖ్య

సంవత్సరం	ప్రయాణికులు
2014–15	10,97,566
2015–16	18,07,389
2016–17	23,59,234
2017–18	24,81,701
2018–19	28,54,118
2019–20	26,91,581
2020–21	11,14,704
2021–22	16,31,316
2022–23	25,00,789
2023–24	29,00,000

(మార్చి 27 వరకు)

నూకాలమ్మ ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు



నూకాలమ్మ అమ్మవారు

రాజవొమ్మంగి: స్థానిక గ్రామదేవత శ్రీనూకాలమ్మ అమ్మవారి గుడి తలుపులు తెరచుకొన్నాయి. కొత్త అమావాస్యకు జరిగే తిరునాళ్లకు ఏర్పాట్లు మొదలయ్యాయి. వంశపారంపర్యంగా వస్తున్న గుడి ఆసాదులు అమ్మవారి తలుపులు తీసి గరగలను బయటకు తీయడంతో ఉత్సవాలు మొదలైనట్టు స్థానికులు భావిస్తారు. ప్రతి రోజు రాత్రిళ్లు జరిగే గరగ నృత్యాలను భక్తులు ఆసక్తిగా తిలకిస్తారు. డప్పు వాయిద్యాలు, బాణాసంచా వెలుగుల్లో తమ ఇళ్లకు వచ్చే గరగలను సాక్షాత్తు అమ్మవారిగా భావించి పసుపు కుంకుమ, నూతన వస్త్రాలు, రకరకాల పిండివంటలు, పండ్లు పూలు సమర్పించి మొక్కులు తీర్చుకోవడం గ్రామస్తుల ఆచారం. ఏప్రిల్ 6. 7. 8 తేదీల్లో అమ్మవారి ఉత్సవాలు జరగనున్నాయి. వేలాదిగా భక్తులు హాజరవుతారు. 9వ తేదీ తెల్లవారుజామున ఉత్సవాలు ముగించడంతో తిరిగి గుడి తలుపులు మూసివేస్తారు. కొత్త అమావాస్య పండుగ ముగియగానే వచ్చే నూతన సంవత్సరం రోజున రైతులు ఏరువాక సాగి పొలం పనులకు శ్రీకారం ఆనవాయితీ. నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు వైభవంగా జరిపేందుకు ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

దివ్యాంగ ఓటర్లకు పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా దివ్యాంగుల నోడల్ అధికారి రహీం

రంపచోడవరం: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో దివ్యాంగులు ఓటు హక్కు ఉపయోగించుకునే విధంగా పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్టు జిల్లా దివ్యాంగుల నోడల్ అధికారి (డీఎంఐవో) పీడబ్ల్యూ డి ఎం.ఎ.రహీం తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాలు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గంలో 3,388 మంది దివ్యాంగులు ఉన్నారన్నారు. 399 పోలింగ్ కేంద్రాల్లోనూ మౌలిక సదుపాయాలు, ర్యాంపులు, వీల్ చైర్లు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఎవరైనా దివ్యాంగులు ఓటర్ కార్డులు లేని వారు ఉంటే వెంటనే దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.ఎస్.శాస్త్రి మాట్లాడుతూ ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలన్నారు, సార్వత్రిక ఎన్నికల్లో రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే , సబ్ కలెక్టర్ , 53 రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎస్.ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేశామన్నారు. ఐటీడీఏ పరిపాలన అధికారి డి.ఎస్.వి.రమణ, సీడీపీవో సంధ్యారాణి, డిప్యూటీ తహసీల్దార్లు ఎస్.వి.వి.సత్యనారాయణ, బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

నీటి సంపులో పడి సెక్యూరిటీ గార్డు మృతి



గణేష్ మృతదేహం వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కూర్మన్నపాలెం: డ్యూటీలో ఉంటూ నీటి సంపులో పడి ఓ సెక్యూరిటీ గార్డు మృతి చెందిన ఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అనకాపల్లి జిల్లా కశింకోట గ్రామానికి చెందిన అల్లవరపు గణేష్ (32) ఆటోనగర్‌లోని ఎస్ బ్లాక్ వద్ద ఉన్న టీపీఎల్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. అతని భార్య దేవి కూడా ఆటోనగర్‌లో పనిచేస్తున్నారు. వీరు దువ్వాడ సెక్టార్ – 1 మంగళపాలెం శ్రీసాయినగర్‌లో అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి నైట్ డ్యూటీకి వెళ్లిన గణేష్ బుధవారం ఉదయం టీపీఎల్ కంపెనీలో ఉన్న నీటి సంపులో విగతజీవిగా పడి ఉన్నాడు. నీటి సంపుపై రక్షణగా జాలీ లేదు. దీంతో టీపీఎల్ కంపెనీ యాజమాన్యం దువ్వాడ పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. గణేష్ భార్య దేవికి అక్కడే పనిచేస్తున్న కంఠపురెడ్డి శ్రీను విషయం తెలియపరిచాడు. వెంటనే అక్కడికి చేరుకున్న భార్య దేవి దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న ప్రభుత్వంలోనే అన్ని ప్రాంతాల అభివృద్ధి



కుందులూరులో స్థానికులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

వీఆర్ పురం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసినట్టు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి చెప్పారు. మండలంలోని కుందులూరు, ములకనపల్లి, రామవరం పంచాయతీల్లో ఆమె బుధవారం పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలిత కుందులూరు గ్రామంలో పర్యటించి మహిళలతో మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో పాలకులు ఏజన్సీ ప్రాంతాభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ, వలంటరీ వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రతీ పేదవాడికి సంక్షేమ పథకాలు అందేలా పాలన చేశారన్నారు.ములకనపల్లి సచివాలయ పరిధిలో ఈ ఐదేళ్ల కాలంలో 1900 మంది లబ్ధిదారులకు రూ.13.50 కోట్లను సంక్షేమం కింద వ్యయ్యం చేశారన్నారు.అనంతరం ప్రతీ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ములకనపల్లిలో పర్యటించారు. అక్కడి నుంచి రామవరం పంచాయతీ పరిధిలోని చొప్పల్లి ,లక్ష్మీనగరం గ్రామాల్లో ఇంటింట ప్రచారం నిర్వహించారు. రామవరం సచివాలయ పరిధిలో ఐదేళ్ల కాలంలో 1450 మంది లబ్ధిదారులకు రూ.9.75 కోట్ల నగదును అందించినట్టు చెప్పారు. ఎస్టీ కమీషన్ సభ్యుడు చిచ్చడి మురళి ,ఎంపీటీసీలు బంధం విజయలక్ష్మి , మిడియం రమాదేవీ, సర్పంచ్ పిట్టా రామారావు , జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ బొడ్డు సత్యనారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాచర్ల గంగులు, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు చిక్కాల బాలు, నాయకులు ముత్యాల మురళి, రాజు, కాంతారావు, నరేష్, బాలాజీ, గౌతమ్, జయరాజ్, రాము తదితరులు పాల్గొన్నారు.

396 నక్షత్ర తాబేళ్లు స్వాధీనం



డీఆర్ఐ స్వాధీనం చేసుకున్న తాబేళ్లు

తాటిచెట్లపాలెం: అక్రమంగా తరలిస్తున్న తాబేళ్లను విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. వాటిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. షాలిమర్ ఎక్స్‌ప్రెస్‌లో నక్షత్ర తాబేళ్లు అక్రమంగా తరలిస్తున్నట్లు ముందుగా అందిన సమాచారంతో డీఆర్ఐ అధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. 396 నక్షత్ర తాబేళ్లు స్వాధీనం చేసుకున్నారు. వీటిని పశ్చిమ బెంగాల్ నుంచి తమిళనాడుకు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. నిందితులను అరెస్ట్ చేసి, తాబేళ్లను ఆంధ్ర ప్రదేశ్ అటవీ శాఖ అధికారులకు అప్పగించారు.

హైకోర్టు జడ్జి రాక రేపు

మహారాణిపేట: రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ వి.శ్రీనివాస్ ఈనెల 29న విశాఖ వస్తున్నారు. విజయవాడ నుంచి వందే భారత్ రైలులో మధ్యాహ్నం 1.50 గంటలకు విశాఖ చేరుకుంటారు. మధ్యాహ్నం 3.30 గంటలకు సింహాచలం వెళ్లి శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకుంటారు. రాత్రికి గరీబ్‌రథ్ రైలులో తిరిగి విజయవాడ వెళ్తారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు జలాభిషేకం చేశారు. ఆలయ ఈవో జి.వి.రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాసరావు భక్తుల నామగోత్రాలతో పూజలు చేశారు. సాయంత్రం కూడా భక్తులు అమ్మవారికి జలాభిషేకం, పూజలు నిర్వహించారు. అమ్మవారిని పసుపు, కుంకుమలతో అభిషేకించారు. పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు అమ్మవారి దర్శనాలు కల్పించారు. ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

డీజిల్ స్మగ్లింగ్ ముఠా అరెస్ట్

దాబాగార్డెన్స్: సముద్రంలో ఉన్న నౌకల నుంచి డీజిల్ స్మగ్లింగ్ చేసే ముఠా గుట్టు రట్టయ్యింది. నిందితులు వీర్రాజు, బడే రాజు, సూరాడ రామును పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు డీసీపీ – 2 ఎం.సత్తిబాబు బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... సముద్రంలో ఉన్న నౌకల నుంచి డీజిల్ తస్కరించి బోట్ల ద్వారా తీరానికి తీసుకొచ్చి లీటర్ డీజిల్ రూ.60, రూ.70కి విక్రయిస్తున్నట్టు గుర్తించామన్నారు. సుమారు 13 మంది నౌకల నుంచి డీజిల్ స్మగ్లింగ్ చేస్తున్నట్టు గుర్తించామని, వీరిలో ముగ్గురు పట్టుబడగా, మిగిలిన వారి కోసం గాలిస్తున్నట్టు తెలి పారు. వీరంతా కాకినాడ, మచిలీపట్నం నుంచి పెద్ద ఎత్తున స్మగ్లింగ్ చేసి విశాఖ తీరానికి తరలిస్తున్నారని, 12 కేన్‌లలో 500 లీటర్ల డీజిల్ స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.